ఒక కథ అందరూ చదవటం [illegible]

# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం**
**కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

బ్రహ్మయ్య వరండాలో కూర్చొని నిశీధిలోకి తదేకంగా చూస్తున్నాడు. ఓమూలగానున్న ప్రమిదలో దీపం చిరుగాలికి రెపరెపలాడుతోంది.

గదిలో బ్రహ్మయ్య ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు, చాలాసేపట్నుంచి మల్లగుల్లాలు పడుతున్నారు. కాని వారి సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లు లేదు. కాశ్మీరు సమస్యలా.

''అమ్మా, అమ్మా, మరే.. అన్నయ్య నా బంతి తీసుకొని ఇవ్వడంలేదు'' ఏడ్చుకుంటూ వచ్చాడు, పెద్దావిడ కొడుకు.



# ప్రాయశ్చిత్తం

**- విశ్వసాయి**

''ఒసేయ్, ఆ వెధవని బయటకీడ్చి తలుపు గడీపెట్టేయ్'' పెద్దగా అరిచాడు పెద్దవాడు. ఆ అరుపుకి ఆ చిన్నవెధవ జడుచుకున్నట్టుంది. ఏడుపు ఆపి అవతలికి పరుగుతీసాడు. ఆమె వెళ్ళి తలుపుకు గడియపెట్టింది.

''ఇష్.. ఇష్.. నెమ్మది, నెమ్మది. మీనాన్న వింటారు. వరండాలోనే కూర్చున్నారు'' అంది ఆ ఇల్లాలు.

''అన్నయ్యా, మనం ఎంతసేపు జుత్తుపీక్కున్నా మనకి సరియైన పరిష్కారం దొరకదు. కాబట్టి మనందరికి సమ్మతైన ఓ ప్రిన్సిపల్‌కి కట్టుబడి ఉందాం. ఓ.కె.నా?''

''ఓ.కె.'' అన్నారంతా ముక్తకంఠంతో. లౌకికవాదం అన్న ప్రిన్సిపల్‌పై కట్టుబడి ఉండాలనుకుంటున్న కిచిడి పార్టీ నాయకుల్లా.

''ఏంటో చెప్పు'' అన్నాడు పెద్దవాడు.

''ఇట్స్ వెరీ సింపుల్. మనం ముగ్గురం కాబట్టి ఆస్తి మూడు వాటాల క్రింద పంచుకోవటం, నాన్నని తలో దగ్గర నాలుగేసి నెలలు ఉంచుకోవటం, అతనికొచ్చే పెన్షన్ డబ్బులు తన తిండికి, మందులకి ఖర్చుచేయడం.''

''మళ్ళీ మొదటికొచ్చాడు కదా, ఇంటిని మూడు భాగాలు ఎలా చేయగలంరా? దీన్ని రెండు భాగాలు చేయగా, ఒక టాయిలెట్, ఒక బెడ్‌రూం మిగులుతాయి.''

''ఇంటిని, అలా పంచుకోవడం కాదు. అమ్మేసి మూడు వాటాలు వేసుకుందాం. అమ్మేవరకూ అద్దెకిచ్చి మూడు వాటాలు పంచుకుందాం.''

''వెరీగుడ్.. చాలా బాగుందిరా నీ ఐడియా, హెడ్ మాస్టరునైన నాకే తట్టలేదు'' మెచ్చుకోలుగా అన్నాడు.

''తగలెట్టినట్టుంది, నీ ఐడియా. మాకు నచ్చినరేటు వచ్చేవరకూ నువ్వాగక, నీకు నచ్చిన రేటు వచ్చేవరకూ మేము ఆగక అమ్మేసుకుంటే ఒకళ్ళమీద ఒకళ్ళుపడి ఏడ్వవలసి వస్తుంది. అదీగాక, వయస్సు మళ్ళిందా, కిడ్నీ కూడా లేదా, ఆయనకి ఏక్షణం ఏం ముంచుకు వస్తుందో తెలియదు. ఆ హాస్పటల్ ఖర్చులకి ఆపెన్షన్ డబ్బులు సరిపోవు కూడాను.'' మూతి ముప్పైమూడు వంకర్లు త్రిప్పిమరీ అందాకోడలు.

''ఇదీ ఆలోచించవలసిందే'' అన్నాడు పెద్దవాడు.

''అయినా అర్జంటుగా అమ్మేయడానికి, ఇప్పుడు

## స్టప్లయ్

హోటల్ రూమ్ తీసుకుంటూ అడిగాడు కస్టమర్. ''రూమ్‌లో దోమలుగాని ఎలుకలుగాని వుంటాయా'' అని.

''ప్రస్తుతానికేం లేవు సార్. మీకు కావాలంటే సప్లై చేస్తాం'' తాపీగా చెప్పాడు రిసెప్షనిస్ట్.

-వాయిగండ్ల మురళీకృష్ణ (ఒంగోలు)

## కట్టేసిన తర్వాత

''అదేంట్రా... స్మశానం ప్రక్కన హాస్పిటల్‌ని కట్టించావ్?'' స్నేహితుడిని అడిగాడు గోవిందం.

''లేదురా... నేను హాస్పిటల్ కట్టాకే ప్రక్కన స్మశానమేర్పడింది'' అసలు సంగతి చెప్పాడు డ్క్టర్ వైకుంఠం.

## చెల్లెలు

''మీకెన్నిసార్లు చెప్పానండీ... పరాయి స్త్రీలను చెల్లెలుగా భావించమని'' విసురుగా అంది భార్య.

''నేనూ అలాగే భావిస్తున్నానే... కాకపోతే నాకు కాదు నీకు చెల్లెలుగా!'' అన్నాడు భర్త.

-పి.వి.సుజాతారాయుడు (జె.జె.నగర్)

## తోడు

''జీవితమంతా నాకు 'తోడు'గా వుంటానని నాతో కల్లబొల్లి కబుర్లు చెప్పి నన్ను పెళ్ళిచేసుకుని ఇప్పుడు మాట తప్పాడు శరత్'' కోపంగా ముక్కు చీదుతూ అంది పద్మ.

''అతను ఏం మాట తప్పాడు?'' సానుభూతిగా అడిగింది స్నేహితురాలు.

''జీవితాంతం తోడు వుంటానని గొప్పలు చెప్పాడా, చీరలు కొనుక్కోవాలి షాపింగుకి తోడు రమ్మని అడిగితే, అది మాత్రం నావల్లకాదు నన్నొదిలేయ్ అన్నాడు'' అసలు సంగతి చెప్పింది పద్మ.

-పి.సరోజ (అమలాపురం)

మనకి డబ్బులు అవసరం ఏమిటి?''

''డబ్బు అవసరం ఉన్నా లేకపోయినా, ఇల్లు అమ్మేయకపోతే పాడైపోదూ? పాడైపోయిన ఇంటిని ఎవరు కొంటారు? కొన్నా ఎంతని వస్తుంది. అందుకని సెటిల్‌మెంట్స్ అన్నీ ఇప్పుడే అయిపోవాలి.''

ఒక స్థిరమైన అభిప్రాయానికి త్వరగా రావటంలో ఆడవాళ్ళకి పెట్టిందిపేరు. అందుకే సబలై అధికార పగ్గాలు కూడా చేపట్టగలిగారు.

''అన్నయ్యా, మనం కూర్చొని ఆలోచిస్తే, ఇది జరిగే పనికాదు. కాబట్టి మనకి సంబంధంలేని నాలుగో వ్యక్తి అవసరం ఇప్పుడెంతైనా ఉండి తీరవలసిందే.''

''ఈ ఐడియా బాగానేవుంది. నాలుగో వ్యక్తి ఎవ్వరైతే బాగుంటుంది?''


''ఇంకెవరు, నాన్నగారి ఫ్రెండ్ రఘురామయ్య అంకుల్. ఆయనైతే నాన్నగార్ని ఒప్పించనూగలడు. అమ్మకాలు, కొనటాలులో అందెవేసిన చెయ్యి.'' అంది ఆరణి, ముద్దుల చెల్లి.

ఆయన్ని కలవడానికి బయల్దేరారు ముగ్గురూ.

● ● ●

బ్రహ్మయ్య, రఘురామయ్యలది విజయనగరం దగ్గర ఒక పల్లెటూరు. దరిదాపు 45 ఏళ్ళక్రితం పొట్టచేత్తో పట్టుకొని విజయనగరం వచ్చేసారు. మొదట్లో కూలి కూడా దొరక్క పస్తున్న రోజులే ఎక్కువ.

రఘురామయ్య టీ కొట్టుపెట్టుకొని వ్యాపారంలో బాగా రాణించాడు. అంతేకాదు తనకంటూ ఓ సర్కిల్‌ని కూడా ఏర్పాటు చేసుకున్నాడు. ఛోటా నాయకుడూ అయ్యాడు. బ్రహ్మాచారి కూడాను. మొదట్లో పెళ్ళాం పిల్లల్ని ఏం పోషించగలంలే అని పెళ్ళి మానుకున్నాడు. తీరా సమస్తం సమకూరేక వయసు మీదపడింది. దాంతో ఇక పెళ్ళాంని ఏం సుఖపెడతాములే అని పెళ్ళి మానుకొని బ్రహ్మాచారయ్యాడు. తరగని సంపద. మంచిపేరు. ఈ ఆస్తిని ఒకరికో, ఇద్దరికో పోసేకంటె పదిమందికి పనికొచ్చేలా చేస్తే బాగుంటుందని, అనాధ బాలల ఆశ్రయం, వృద్ధుల ఆశ్రయం, రెండూ నిర్వహిస్తున్నాడు. ఇక బ్రహ్మయ్య ఒక బస్సులో క్లీనరుగా ఉద్యోగం సంపాదించుకొని, డ్రయివింగు నేర్చుకొని డ్రయివరయ్యాడు. ఇతడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కుటుంబ శ్రేయస్సుకు అనుక్షణం ఆరాటం. తనలా కాకుండా తన పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించాలనే తపన. ఆ ఆరాటం, తపన, అతన్ని యాంత్రికంగా తయారుచేసాయి. తన కోర్కెలను, వాంఛలను, అవసరాలను చంపుకొని, వాళ్ళని పెంచి పెద్దవాళ్ళని చేసాడు. పెద్ద చదువులు చదివించుకోలేకపోయినా వాళ్ళ జీవనభృతికి అవకాశం కల్పించే చదువులు మాత్రం చదివించుకోగలిగాడు. అందుకే ముగ్గురూ టీచర్లయి, వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతకగలుగుతున్నారు.




బ్రహ్మయ్య తన జీవితంలో తనేం సుఖపడలేదనే చెప్పుకోవాలి. గత ఏడాదే రిటయిరయ్యాడు. అంతా కలిపి మూడు లక్షలు వచ్చింది. రెక్కలొచ్చిన పక్షిపిల్లల్లా తమ త్రోవను తాము వెతుక్కుంటూ పిల్లలంతా వెళ్ళిపోయారు. ఇక తనూ, భార్య. ఇక ఇబ్బందులులేవు, డబ్బుకు లోటులేదు. ఇక మిగిలిన జీవితమైనా ఆనందంగా గడుపుకోవాలని ఆశిస్తున్న తరుణంలో, భార్యకి జబ్బుచేయడం, క్రిందటివారంలో చనిపోవటం కూడా జరిగింది.

● ● ●

''సరే మేం వెళ్ళొస్తాం'' అంటూ బయల్దేరారు అన్న, తమ్ముడు, బావమరిది.

ఆరుబయట పచార్లు కొడుతున్న రఘురామయ్య, వాళ్ళ రాకని గమనించాడు. ఏనాడూ రానిది ఈనాటికి వాళ్ళ రాకలో గల అంతర్యాన్ని గ్రహించడానికి అతనికి ఏమాత్రం సమయం పట్టలేదు. తన అనుభవాల పుస్తకాల్లో ఈ అంతర్యాల అధ్యాయాలెన్నో చదివిన వ్యక్తి ఆయన.

''గురుత్రయానికి నా హృదయపూర్వక నమస్కారాలు'' చిరునవ్వుతో సాదరంగా ఆహ్వానిస్తూ అన్నారు.

''పెద్దలు మమ్మల్ని ఆశీర్వదించాలేగాని, నమస్కరించి ఆయుక్షీణం గావించకూడదు'' అన్నాడు పెద్దవాడు తెలివిగా.

''గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వరా

గురు సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై గురవే నమః అన్నారు పెద్దలు.''

అంతా నవ్వేసారు. అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని పరిచయం చేసాడు రఘురామయ్య.

''ఈయన కృష్ణమోహన్ అని మన ఊర్లో లీడింగ్ లాయర్. అంతేకాదు స్వయానా నా మేనల్లుడు కూడా. ఇక ఇతను ప్రస్తుతం లాయర్‌గారి క్లయింట్, పేరు మాధవ్. పూర్వాశ్రయంలో కృష్ణమోహన్ పెదతండ్రి కొడుకు, అంటే కజిన్ అన్నమాట. వీరు వైజాగ్‌లో ఉంటున్నారు'', క్లుప్తంగా పరిచయం చేసాడు.

''మామయ్యా, క్లయింట్స్ వచ్చేటైమయింది. నేను ఆఫీసుకి వెళ్ళాలి. కేసు ఫైలు చేసాక రేపు కలుస్తాను'' అంటూ బయల్దేరాడు కృష్ణమోహన్. అతనివెంట మాధవ్ కూడా.

''ఏంటండి కేసంటున్నారు'' అడిగాడు చిన్నవాడు చాలా ఇంటరెస్టింగ్‌గా.

''మాధవ్ తండ్రికి ముగ్గురు మగపిల్లలు, ఒకర్తే ఆడపిల్ల. మాధవ్ కడపటివాడు. ముగ్గురు మగపిల్లలూ మంచి పొజిషన్‌లో ఉన్నారు. ఆడపిల్లకి చిన్నప్పుడే పోలియో సోకింది. తనపని కూడా తను చేసుకోలేని స్థితిలో ఉంది. ఇప్పుడు వయస్సు కూడా పాతిక పైమాటే. మాధవ్ తండ్రి రైల్వేలో పనిచేసి రిటైరయ్యాడు. వైజాగ్‌లో మూడు ఫ్లోర్లున్న ఇల్లు ఉంది. బ్యాంకు బాలెన్సులు పదిలక్షల పైచిలుకే ఉన్నాయి. అయితే, ఈమధ్యే తను కాలం చేసాడు. పోతూ, పోతూ, తన స్థిర చరాస్తులన్నీ ముగ్గురు కొడుకులను సమానంగా పంచుకోమని వీలునామా వ్రాసి పోయాడు. ఆ వీలునా

మాలో ఊతురు సంగతే ఎత్తలేదు. ఆ తండ్రి త్రాగుబోతు. అతడు బాగా మైకంలో ఉన్నప్పుడు ఆ ఇద్దరు కొడుకులే ఈ దారుణానికి ఒడికట్టి ఉండవచ్చు అంటాడు మాధవ్. అందుకే చెల్లికి కూడా వాటా ఇవ్వమని, ఆమె బ్రతికున్నంతకాలం సుఖంగా బ్రతకటాన్కి ఓ త్రోవ చూపమని అడిగాడు. వారు ససేమిరా అనటంతో కోర్టుకు వెళతానంటున్నాడు.

చూసారా, మనిషి ఎంత ఉన్నత స్థాయిలోనున్నా సంస్కారం లేకపోతే మూర్ఖుడు, ముష్కరుడు అవుతాడు. విచిత్రమేమిటంటే, కాకుల గూట్లో పెరిగిన కోయిలలో, కాకుల లక్షణాలు కన్పించవు. ఇంకా చెప్పుకుంటే హింసాత్మక ధోరణులను రెచ్చగొట్టే అటు బ్రిటిష్ ప్రభుత్వం ఇటు మన నాయకుల మధ్య అహింసావాదిగా విలక్షణంగా నిలచారు మన పూజ్య గాంధీజీ. గంజాయివనంలో తులసి మొక్కలా, ఆ విలక్షణ స్థితి ప్రకృతి ప్రసాదించిన వరం. ఎందుకంటే అలాంటి విలక్షణమైన పదార్థం లేకపోయినట్లయితే ఈ మానవాళి ఏనాడో అంతరించిపోయేది. ఆ ముగ్గురిలో మాధవ్ మంచివాడు, నిస్వార్థపరుడు, సంస్కారవంతుడు. అటువంటి కుటుంబంలో అతడు లేకపోతే ఆ పిల్లకి అన్యాయం జరిగేదే కదా.''

...వింటున్న తాము కూడా ఏదో తప్పు చేస్తున్న గిల్టీ ఫీలయ్యారంతా. అక్కడ నుండి వెళ్ళిపోవాలనిపించింది. కాని డబ్బే. డబ్బెవరికి చేదు. అయినా మనం ఎవరి సొమ్ము పడేసుకోవటంలేదుగా. మన వాటా మనం కోరుకుంటున్నాం. ఈరోజు కాకపోతే రేపైనా మనకే రావలసిందిగా. తమను తాము మనసులో సమర్థించుకున్నారు. ''సర్లెండి, ఊరక రారు ఉపాధ్యాయులు. ఏదో చెప్పాలని వచ్చే ఉంటారు.''

ఆ మాటల్లో వ్యంగ్యాన్ని అర్థం చేసుకోలేని మూర్ఖులు కాదు వారు. ఎలా ప్రారంభించాలో తెలియక, ''నాన్నగారి విషయం...'' నసుగుతూ అన్నాడు పెద్దవాడు, పెద్దరికంగా.

''మీనాన్నకేం భయంలేదయ్యా. వారు నాకు తమ్ముడు. కళ్ళలో ఒత్తులు వేసుకుమరీ వారిని కాపాడుకుంటాను'' అభయమిచ్చాడు. ఆ అభయానికి ఆనందించాలో, ఏడవాలో అర్థంకాలేదు వారికి. వారి ముఖాల్లో రక్తం గడ్డకట్టింది. ముఖాలు కందగడ్డలా ఎర్రబారిపోయాయి. అనుకున్నదొకటి, అయినదొకటి. దేనికోసమో అన్నట్లు దిక్కులు చూస్తున్నారు.

''అదేకదా మీక్కావల్సింది.''

''అదేననుకోండి...'' మరోమాట మాట్లాడ్డానికి పెద్దరికం అడ్డొచ్చినట్లుంది పెద్దవాడికి.

''అదేననుకోండి అంటున్నారు. మీరు ఇంకేమైనా అనుకుంటున్నారా?'' వారి అంతరంగాల్లో నిక్షిప్తమైయున్న ఆలోచనల్ని బయటకి రప్పించేందుకు మరో ప్రయత్నంగా అడిగాడు.

కొడుకులు మౌనం వహించారు. అల్లుడే కల్పించుకుంటూ, ''మామయ్యగారిని మాతో తీసుకుపోదామనుకుంటున్నాము. మా ఒక్కొక్కరి దగ్గర నాల్గేసి నెల్లు అట్టేపెట్టుకోవాలనుకుంటున్నాం. అలానే ఉన్న ఆస్తిపాస్తుల్ని పంచేసుకుందామనే ఆలోచనలో ఉన్నాం'' అన్నాడు. ఎంతైనా అల్లుడు కదా, పరాయివాడు. మనసులో ఉన్నది నిర్లజ్జగా పూర్తిగా కక్కేయగలిగాడు.

అందరివైపు ఆశ్చర్యంగానూ, ప్రశ్నార్థకంగానూ చూసాడు. తాను ఊహించినది నిజమే అనుకున్నాడు. మైక్రోస్కోప్‌తో వెతికినా వాళ్ళ ముఖాల్లో రవ్వంత కృతజ్ఞతా భావంగాని, గౌరవంగాని కన్పడలేదతనికి.

''మీరు అలాంటి డెసిషన్‌కి వస్తే నేనేం చెప్పగలను?''

''మీరోసారి నాన్నగారి చెవినవేసి ఆ పంపకాల కార్యక్రమం ఏదో సజావుగా జరిగేటట్టు చూస్తే జన్మ జన్మలకి మీకు రుణపడి ఉంటాం.'' అంటూ చిన్నగా అర్థించాడు చిన్నవాడు.

''రుణం, కృతజ్ఞత అనేవాటికి అర్థాలు తెలుసా మీకు. తానైనా తినకుండా ఉన్న నాలుగు మెతుకులు సద్ది మీ కడుపునింపిన తల్లిపట్ల మీకున్న అభిమానం, ఆత్మీయత ఇదేనా? పదోరోజు కార్యక్రమం అయిందని పించేసి వాటాలకు దిగారు. రాత్రి పగలు నిద్రాహారాలు లేకుండా, తన రక్తాన్ని ధారపోసి, ఆఖరికి కొడుకు ప్రాణాపాయస్థితిలో ఉంటే తన కిడ్నీని కూడా ఇచ్చేసిన తండ్రి పట్ల కృతజ్ఞత, గౌరవం లేకపోగా భార్యపోయిన దుఃఖంలో ఉన్న తనను ఓదార్చడంపోయి అతన్ని పంచుకోవాలని చూస్తారా. కనీసం ఫస్ట్ ఎయిడ్ కూడా అందని పల్లెటూళ్ళకు తీసుకుపోయి మీ నాన్నని ఏం సుఖపెడదామనుకున్నారు. ఉపాధ్యాయులే ఇలా సంస్కార హీనుల్లా ప్రవర్తిస్తే ఎలా? చదువు, ఉద్యోగం పొందడానికే పనికిరాకూడదు. సంస్కారం నేర్పగలగాలి. అదే చదువు అవుతుంది. అటువంటి చదువు కనీసం మీ పిల్లలకైనా నేర్పండి. వారైనా సంస్కారవంతులై మిమ్మల్ని ఉద్ధరిస్తారు. ఇంతకన్నా నేను ఏమీ చెప్పలేను.'' అందరి ముఖాల్లో ఇన్‌ఫీరియారిటీ కొట్టొచ్చినట్లు కన్పించింది. సిగ్గుతో తలవంచేసారు. చేసేది లేక ఇంటిముఖం పట్టారు. తామేదో తప్పుగా ఆలోచిస్తున్నామన్న భావన. ఆ ఆలోచనల్తోనే ఇంటికి చేరుకున్నారు.

''ఒరేయ్ పెదబాబు''


''ఏం నాన్న'' దగ్గరగా వచ్చాడు.

''నీ రిపోర్ట్సుని డాక్టరుగారు పంపించారు. బ్లడ్ బాగా తక్కువగా ఉందట. అందుకే బాగా ఎనిమిక్ అయిపోయావంటున్నారు. బ్లడ్ అర్జంటుగా ఎక్కించకపోతే చాలా ప్రాబ్లమ్స్ మళ్ళీ రావచ్చంటున్నారు. నీ 'ఓ' గ్రూప్ బ్లడ్ మనవాళ్ళకి ఎవరికి లేదు. నాదీ 'ఓ' గ్రూపే కాబట్టి రేపుదయాన్నే బ్లడ్ ఇస్తాను. నాతో హాస్పిటల్ కిరా. కనీసం రెండ్రోజులైనా లీవ్ ఎక్స్‌టెన్షన్ చేసి బ్లడ్‌ని ఎక్కించుకోకపోతే నీ ఆరోగ్యం బాగా దెబ్బతింటుందిరా.''

తండ్రి అన్న మాటలకి భోరుమని ఏడుస్తూ తండ్రి కాళ్ళమీద పడ్డాడు. ఆస్తి ఐశ్వర్యాలకంటే మిన్నవైన ప్రాణాన్ని ఇస్తున్న తండ్రి పాదాలని కన్నీళ్ళతో కడిగి తగిన ప్రాయిశ్చిత్తాన్ని పొందుతున్నాడు.

★

## డ్రైవర్ లేని జీప్



కొరియర్ యూనివర్శిటీకి చెందిన కొందరు ప్రొఫెసర్స్ ట్రాఫిక్‌తో నిండిపోయిన వీధుల్లో డ్రైవర్ లేని జీపును నడిపించి సఫలీకృతులయ్యారు. రోడ్డుపై ట్రాఫిక్ వివరాలను కంప్యూటర్‌కు ఫీడ్ చేసేందుకు అనుగుణంగా రెండు కెమేరాలు ఈ జీపుకు అమర్చబడ్డాయి. రోడ్‌మీద వచ్చే పాదచారులు, ఇతర వాహనాలు, రోడ్‌లో మెలికలు, ఫుట్‌పాత్‌లు తదితర అన్నివివరాలు ఈ కెమేరాల ద్వారా కంప్యూటర్‌కు చేరతాయి. తదనుగుణంగా హేండిల్, బ్రేక్స్, క్లచ్, యాక్సిలేటర్‌లను కంప్యూటర్ ఆపరేట్ చేస్తుంది. అల్ట్రాసోనిక్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్స్ ఈ జీపుకు అమర్చబడి వుంటాయి. ఇవి విషయాన్ని, ఎదురుగా వచ్చే వాహనాలు ఏ వేగంతో ఎంతదూరంలో దూసుకువస్తున్నాయన్నది కంప్యూటర్‌కు తెలియజేస్తాయి. ఈ వివరాలకు అనుగుణంగా కంప్యూటర్ జీపును డ్రైవ్ చేస్తుంది.

-శ్రీకొండ (ఎర్రబోడు)

## మిరపకాయ మాట

చాలా ప్రాంతాల్లో వివిధరకాల కూరల్లో, రకరకాల పదార్థాల్లో కారాన్ని తప్పనిసరిగా వాడుతూవుంటారు. కారంగానీ, పచ్చిమిరపకాయలుగానీ లేని కూరలను, సాంబారును మనం ఊహించలేం కదూ! చిత్రమేమిటంటే 800 సంవత్సరాల క్రిందట మన దేశస్థులకు మిరపకాయల గురించిగానీ, కారం గురించిగానీ తెలియదు. కారం లేకుండా అప్పట్లో మన పూర్వీకులు పదార్థాలను ఎలా తినగలిగేవారో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది మనకు. సముద్రంపై వర్తకం చేసే వర్తకుల ద్వారా 800 సంవత్సరాల క్రిందట ఈ ఎర్రని మిరప మనదేశంలోకి ప్రవేశించింది. 7000 సంవత్సరాల నుంచీ ఘాటైన ఎర్రటి మిరప, ఆకుపచ్చటి మిరపకాయలు- మధ్య అమెరికాలోనూ, దక్షిణ అమెరికాలోనూ విరివిగా పండేవి. అప్పట్లో అవి మనదేశంలోకి వచ్చి వుండకపోతే మనం చప్పిడికూరలు తింటూవుండేవాళ్లం. అవునా?

-కొడిమెల

